సాక్షి
సంగారెడ్డి

శనివారం । 10 । మే । 2025



## సరదా సరదాగా..

ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదానికీ సిద్దిపేట చిరునామాగా నిలుస్తోంది.

వివరాలు 10లో ▸



## విజ్ఞాన కేంద్రం...

విద్యార్థులు వేసవి సెలవుల్ని సద్వినియోగం చేసుకునేలా జహీరాబాద్ శ్రామిక్ విజ్ఞాన కేంద్రం శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది.

వివరాలు 10లో ▸



## గడప దాటితే గడబిడే

ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు జనాభాకు తగిన విధంగా నిర్మించలేకపోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాలు 11లో ▸

# న్యూస్‌రీల్

## వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య

పటాన్‌చెరు టౌన్: వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. అమీన్‌పూర్‌లోని ది నెస్ట్ వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వృద్ధుల బాగోగులను మనమే చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. న్యాయపరమైన విషయంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ది నెస్ట్ ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాపై అవగాహన కల్పించాలి

ఏఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి : స్కూల్స్, కళాశాలలకు వేసవి సెలవులు వచ్చిన నేపథ్యంలో పిల్లలు, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు ప్రభావితమై సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయాలేర్పడి పిల్లలు దారితప్పే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు వారికి సోషల్ మీడియా పట్ల పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వీలైతే పిల్లలకు కొత్త కొత్త నైపుణ్యాలను నేర్పించాలని కోరారు.

## సమస్యలపై ప్రత్యేక దృష్టి

జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న



మండల పరిషత్‌లో తనిఖీలు చేస్తున్న డిప్యూటీ సీఈఓ స్వప్న

కల్హేర్(నారాయణఖేడ్): సమస్యల పరిష్కారం పట్ల దృష్టి పెట్టాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న అధికారులను ఆదేశించారు. కల్హేర్ మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. ఎంపీడీఓలు రమేశ్ బాబు, సంగ్రామ్, ఎంపీఓ శ్రీనివాస్, సిబ్బంది పరమేశం, షాకీర్, సాగర్ పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి కృషి

సీఐటీయూ రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: ప్రజలు,కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికవర్గంతోపాటు అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య పిలుపునిచ్చారు. మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో గల వాగ్వాల్స్, పటాన్‌చెరు పట్టణంలోని అస్సాం కార్బన్ పరిశ్రమలలో కార్మికుల జనరల్‌బాడీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య హాజరై మాట్లాడారు. ఈనెల 20 దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె విజయవంతానికి పరిశ్రమలు స్వచ్ఛందంగా బంద్‌పాటించాలని కోరారు. కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్వర్, రాజేశ్వర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

### రూ.18 లక్షల పరిహారం అందజేత

పటాన్‌చెరు పట్టణంలోని అగర్వాల్ రబ్బర్ పరిశ్రమలో కొన్నిరోజుల క్రితం జరిగిన ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన ఓ కార్మికునికి నష్టపరిహారం కింద పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన రూ.18 లక్షల డీడీని రాజయ్య కార్మికుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ...కార్మికులు ప్రమాదాలు జరిగినప్పుడు యజమానులు మానవీయ దృక్పథంతో ఆలోచించి కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమ యజమాన్యం కార్మిక కుటుంబాన్ని ఆదుకోవడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు.

## అమర జవాన్లకు అశ్రు నివాళి

దేశం కోసం వీరమరణం పొందిన గిరిజన బిడ్డ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని రాజకీయ నాయకులు, ఉద్యోగ సంఘాల నేతలు సంగారెడ్డిలోని ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జహీరాబాద్ టౌన్‌లో ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

సంగారెడ్డి/జహీరాబాద్ టౌన్ :



అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న బంజార నాయకులు

## ఆంజనేయ.. ఆర్మీకి నీవే అండ

ఉమ్మడి జిల్లాలో చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ యుద్ధంలో త్రివిధ దళాలు విజయవంతం కావాలని శతఘట్టాభిషేకం నిర్వహించారు. పూజలో ఆలయ ఫౌండర్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

– శివ్వంపేట(నర్సాపూర్)



శతఘట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

# పంట రుణం రూ.3,404 కోట్లు

రైతులకు ప్రభుత్వం తీపి కబురునందించనుంది. ఈసారి వారికి పంటరుణాలకు గతేడాదికంటే 14.5% అధికంగా ఇవ్వాలని నిర్ణయించింది. త్వరలోనే డీసీసీ సమావేశంలో ఇందుకు సంబంధించి ప్రకటించనున్నారు. త్వరలో ప్రకటించనున్న నిర్ణయంతో జిల్లాలో 2.93 లక్షల మంది రైతులకు పంట రుణాలు అందనున్నాయి. మరి బ్యాంకర్లు రుణాల మంజూరులో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.



- ఈసారి 2.93 లక్షల మంది రైతులకు ఇవ్వాలని నిర్ణయం
- గతేడాదికంటే 14.5% అధికంగా లక్ష్యం
- ఖరారైన 2025–26 వార్షిక రుణ ప్రణాళిక
- త్వరలో డీసీసీ సమావేశంలో ప్రకటన

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఈ ఖరీఫ్, రబీ పంట సీజన్లలో రైతులకు రూ.3,404 కోట్ల మేరకు పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు లక్ష్యంగా నిర్ణయించారు. మొత్తం 2.93 లక్షల మందికి ఈ రుణాలను ఇవ్వనున్నారు. ఈ మేరకు 2025–26 ఆర్థిక ఏడాదికి సంబంధించి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఇటీవల ఖరారైంది. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కూడా ఈ ప్రణాళికకు ఆమోదముద్ర వేసింది. గత ఆర్థిక ఏడాదికంటే ఈసారి సుమారు 14.5% అధికంగా రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలకు ఇచ్చే రుణాలు, వ్యవసాయ టర్మ్‌లోన్ల, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనకు ఇచ్చే రుణాలు రుణాలు ఇలా అన్నీ కలిపితే మొత్తం 3.13 లక్షల మంది రైతులకు రూ.6,721.87 కోట్ల వ్యవసాయ రంగానికి సంబంధించిన రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### గతేడాది 88 శాతమే రుణాలు..

గత ఆర్థిక సంవత్సరం 2024–25లో రూ.3,328.19 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ బ్యాంకర్లు కేవలం రూ.2,942 కోట్లు మాత్రమే పంట రుణాలను ఇచ్చారు. అంటే నిర్దేశిత లక్ష్యంలో కేవలం 88.41% మాత్రమే ఈ రుణాలను ఇవ్వగలిగారు. ఈసారి ఈ రుణ లక్ష్యాన్ని 14.5% పెంచినప్పటికీ...బ్యాంకులు ఏ మేరకు రుణాలిస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో మరో నెల రోజుల్లో ఖరీఫ్ పంటల సీజను ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో రైతులకు పెట్టుబడి కోసం డబ్బుల అవసరం ఎక్కువగా ఉంటుంది. బ్యాంకులు వెంటనే ఈ రుణ మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తే రైతులకు సకాలంలో పెట్టుబడులకు డబ్బులు అందుతాయనే అభిప్రాయం అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

### త్వరలో డీసీసీ సమావేశం..

డీసీసీ (డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ) త్వరలో సమావేశం నిర్వహించి ఖరారైన ఈ వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించనున్నారు. ఈ మేరకు త్వరలో ఈ కమిటీ సమావేశం నిర్వహించాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. కలెక్టర్ వల్లూరు క్రాంతి నేతృత్వంలోని ఈ కమిటీ సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ సెక్టార్ బ్యాంకులు, కో ఆపరేటివ్ రంగంలోని బ్యాంకులకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొనున్నారు.

### గృహ రుణాలకు మాత్రం భిన్నంగా..

రైతులకు పంట రుణాలు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహించే బ్యాంకర్లు గృహ రుణాలకు మాత్రం గతేడాది విరివిగా మంజూరు చేశారు. ఈ హౌసింగ్ లోన్లకు నిర్దేశించిన లక్ష్యం కంటే రెట్టింపు స్థాయిలో ఈ రుణాలిచ్చారు. పంట రుణాల విషయంలో నిర్దేశించిన లక్ష్యంలో 88% మాత్రమే రుణాలిస్తే..ఈ హౌసింగ్ రుణాలు మాత్రం ఏకంగా 207% రుణాలిచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈసారైనా బ్యాంకర్లు కొర్రీలు పెట్టకుండా అన్నదాతలకు పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

# వడ్ల కొనుగోళ్లలో జాప్యం

- రైతుల పడిగాపులు
- మ్యాచర్ రాలేదని ఇబ్బందులు పెడుతున్న సిబ్బంది
- ఖేడ్ పీఏసీఎస్ దుస్థితి



చెట్ల కింద సేద తీరుతున్న రైతులు

నారాయణఖేడ్: వరి కొనుగోలు కేంద్రాల్లో సక్రమంగా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నారాయణఖేడ్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ర్యాలమడుగు, నిజాంపేట్‌లలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ర్యాలమడుగు కేంద్రానికి వడ్లను తీసుకువచ్చిన రైతులు ఎండలో వేచి ఉన్నా తూకం మాత్రం వేయడంలేదు. తేమశాతం తెలిపే మ్యాచర్ రాలేదంటూ పీఏసీఎస్ సీఈవో కొర్రీలు పెడుతూ తూకం వేయకపోవడంతో రైతులు తమ వడ్లను ఎండలోనే ఆరబెట్టుకుంటున్నారు. కొన్నింటికి మ్యాచర్ వచ్చినా తూకం చేపట్టకపోవడంతో వరి కుప్పలపై బస్తాలను కప్పి ఉంచుతున్నారు. వర్షం పడితే తమ ధాన్యం తడిచిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, నీడవసతి లాంటివి చేపట్టలేదు. అదనంగా తూకం వేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

### బ్లాక్ లిస్టులో ఉన్న సొసైటీకి కేంద్రాలు..

నాలుగేళ్ల క్రితం కందుల కొనుగోళ్లలో ఖేడ్ పీఏసీఎస్ సొసైటీ అక్రమాలకు పాల్పడింది. రైతుల పేర వ్యాపారుల కందులు కొనుగోలు చేశారని ఆరోపణలు రావడంతో విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పట్నుంచీ ఈ సొసైటీని బ్లాక్ లిస్టులో పెట్టారు. మార్క్‌ఫెడ్ అధికారులు ఈ సొసైటీకి కందులు, పెసర్లు, జొన్నల కొనుగోళ్లకు అనుమతివ్వరు. కానీ వరి కొనుగోళ్లకు అనుమతించి ఏకంగా రెండు కేంద్రాలను కట్టబెట్టారు. నిజాంపేట్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కేంద్రం ఉండగా అదనంగా కేంద్రాన్ని ఇవ్వడంపట్ల విమర్శలు వస్తున్నాయి.

### మ్యాచర్ వస్తేనే తూకం

మ్యాచర్ రాకపోవడతో తూకం వేయడంలేదు. ఏఈవో వచ్చి మ్యాచర్‌చూసి చెప్పాకనే తూకం వేస్తాం. బ్లాక్‌లిస్టులో ఉన్నందునే మార్క్‌ఫెడ్ ద్వారా కంది, పెసర, మినుము, జొన్నల కేంద్రాలు తమకు ఇవ్వడంలేదు. వరి ధాన్యం సివిల్ సప్‌లై కావడంతో ఇచ్చారు.

– జగన్నాథం, పీఏసీఎస్ సీఈవో



కొనుగోళ్లు లేక ఆరబెట్టిన ధాన్యం

# భూ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ క్రాంతి వల్లూరు

కొండాపూర్(సంగారెడ్డి): భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా వచ్చిన భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లిలో శుక్రవారం నిర్వహించిన భూభారతి సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతులు సమర్పించిన దరఖాస్తులో భూ సమస్యలను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృతి చేసుకోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అంతకు ముందు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గొల్లపల్లిలోని పీఏసీఎస్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ అశోక్‌తో టు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

## మేనేజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి జోన్: జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా పారిశ్రామిక రంగ అభివృద్ధికి కాంట్రాక్టు పద్ధతిలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ తుల్జా నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈడీసీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తుకు నేడు చివరి తేదీ అని వెల్లడించారు.



# పిల్లలకు మంచి నడవడిక నేర్పించాలి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు మంచి నడవడిక నేర్పించాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ప్రభుత్వం మినీఅంగన్‌వాడీ టీచర్లను ప్రధాన అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ వేతనాన్ని రూ.7,800 నుంచి రూ.13,650లకు పెంచిన నేపథ్యంలో శుక్రవారం ఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డితోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సంజీవరెడ్డి మాట్లాడుతూ...పిల్లల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త విద్యాసంవత్సరం నుంచి నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను నిర్వహించనున్నందున టీచర్లు పిల్లలపై ప్రత్యేక దృష్టిపెట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని జూకల్ శివారులో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లను సంజీవరెడ్డి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తిచేసి మిగిలిన శానిటరీ, విద్యుత్ వైరింగ్, తాగునీటి వసతి పనులను పూర్తిచేయాలని గుత్తేదార్లను ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారంశంకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్

# నిలువ నీడలేదు.. నీళ్లూ లేవు

## ఉపాధి కూలీల అవస్థలు

- పట్టించుకోని అధికారులు
- ఎండ తీవ్రతకు అల్లాడుతున్న కూలీలు

హత్నూర (సంగారెడ్డి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు తాగు నీళ్లు లేవు. ఎండలు దంచుతున్న కూలీలకు కనీసం నీడ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఉపాధి కూలీలు నీళ్లు లేక నీడ లేక అల్లాడిపోతున్నారు. ప్రభుత్వంతోపాటు ఉన్నతాధికారులు ఉపాధి కూలీలకు పని వద్ద తాగునీటితోపాటు నీడను ఏర్పాటు చేయాలని ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. హత్నూర మండలంలో 38 గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో 13 వేలమంది ఉపాధి హామీ పథకం కూలీలు పేర్లు నమోదు చేసుకోగా ఎండవేడికి తట్టుకోలేక ప్రస్తుతం 2,500 నుంచి 3000 మంది ఉపాధి కూలీలు మాత్రమే గ్రామాలలో పనిచేస్తున్నారు. ఒక్కొక్క గ్రామంలో సుమారు 60మంది కూలీలు మాత్రమే పనికి వస్తున్నారు.

### టెంట్లు ఎక్కడ?

ఉపాధి హామీ పనుల వద్ద కూలీల కోసం తాగునీరు ఏర్పాటు చేయాలి. కూలీలకు కొంత సమయం సేద తీరేందుకు టెంట్లను ఏర్పాటు చేసి నీడ కల్పించాలి. కానీ, ఎక్కడ కూడా తాగునీరు టెంట్లు ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుటుంబ పోషణ భారమై తప్పని పరిస్థితుల్లో ఉపాధి కూలీలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని కూలీలు వాపోతున్నారు. ఎండల తీవ్రతను తట్టుకోలేక ఉపాధి కూలీలు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు తాగునీటి సౌకర్యంతోపాటు నీడను ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ఉపాధి కూలీలు అధికారులకు విజ్ఞప్తి చేశారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న నస్తీపూర్ ఉపాధి హామీ కూలీలు

### ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నాం

ఉపాధి హామీ పథకం పనిచేసే వద్ద కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నాం. నీళ్ల ఏర్పాటు చేస్తే ఎండకు వేడిగా అయిపోతున్నాయి అందుకే పెట్టడం లేదు. రోజు ఒక దగ్గర పనిచేస్తున్నారు. అందుకోసమే టెంట్లు ఏర్పాటు చేయలేదు.

– ప్రవీణ్ కుమార్, ఏపీఓ



### నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాం



ఉపాధి పనికి వెళ్తే తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం. ఇంటినుంచి తీసుకెళ్లిన నీళ్లు సరిపోవడం లేదు. ఎండలకు దాహం వేస్తోంది. తాగుదామంటే గుక్కెడు నీళ్లు కూడా లేవు. ఏమి చేయలేకపోతున్నాం.

– మాచునూరి లక్ష్మి, నస్తీపూర్

### నీడ కూడా కల్పించడం లేదు



మండుటెండలో పనిచేస్తున్నాం. కనీసం తాగునీటిని ఏర్పాటు చేయలేదు. పని మధ్యలో నీడకు ఉందామంటే టెంటు కూడా వేయలేదు. ఇప్పటికైనా అధికారులు నీళ్లు నీడను కల్పించాలి.

– గిరికల లత

## క్లుప్తంగా

### మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

సిద్దిపేట సీపీ అనురాధ

**సిద్దిపేట కమాన్:** యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. తాత్కాలిక ఆనందం కోసం కుటుంబాలను దూరం చేసుకోవద్దన్నారు. మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలన్నారు. మత్తు పదార్థాల గురించి ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ 87126 67100కు సమాచారం తెలపాలని సూచించారు.

### గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

**పటాన్‌చెరు టౌన్:** గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర గౌడ్ కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి ఇసుక బావి వద్ద శుక్రవారం ఓ బహిరంగ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందింది. పటాన్‌చెరు ఎక్సైజ్ అధికారులు వెళ్లి చూడగా రామచంద్రపురానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ వేరే వ్యక్తికి గంజాయి విక్రయిస్తున్నాడు. వెంటనే అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 260 గ్రాముల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు.

**మూడు చోట్ల 3.315 కిలోలు స్వాధీనం**

**సంగారెడ్డి జోన్:** సంగారెడ్డి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు చోట్ల 3.315 కేజీల గంజాయి పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం అధికారులు వెల్లడించారు. ఎస్‌ఆర్ నగర్‌కు చెందిన సందీప్ వద్ద నిల్వ ఉన్న 1.500 కేజీల గంజాయి, స్కూటీ, సెల్ ఫోన్, బీరంకొండకు చెందిన సాయికుమార్, శ్రీకాంత్ వద్ద నిల్వ ఉన్న 1.200 కేజీల గంజాయి, బైకు, రెండు సెల్ ఫోన్‌లు పట్టుకున్నామన్నారు. అలాగే మరో వ్యక్తి వద్ద 615 గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి సంగారెడ్డి పోలీసులకు గంజాయితోపాటు అప్పగించామన్నారు. దాడుల్లో సీఐలు వీణా రెడ్డి, బీ.గాంధీ, ఎస్ఐలు అనిల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో చెరువులో దూకి ఆత్మహత్య

**కౌడిపల్లి(నర్సాపూర్):** చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మహమ్మద్‌నగర్‌లో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య తన చిన్నకూతురు బాలమణిని కౌడిపల్లికి చెందిన చాకలి శేఖర్(40)కి ఇచ్చి వివాహం చేసి ఇల్లరికం అల్లుడిగా తెచ్చుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. గతేడాది కాలంగా శేఖర్ మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి శేఖర్ మద్యం సేవించి రావడంతో మళ్లీ గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న అతడు కన్నారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు

**జిన్నారం (పటాన్‌చెరు):** ఓ ప్రైవేట్ క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేసిన ఘటన మండలంలోని వావిలాల గ్రామంలో చోటుచేసుకుంది. అధికారుల కథనం మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరు డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాము ఆధ్వర్యంలో శుక్రవారం జిన్నారం మండలం వావిలాల గ్రామంలోని ఓ క్లినిక్ పై దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా గడువు ముగిసిన 25 రకాల మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.10 వేల వరకు ఉంటుంది. ఎలాంటి అర్హత లేకుండా క్లినిక్ ను నిర్వాహకుడు సత్యనారాయణ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిన్నారం, బొల్లారం కంట్రోల్ ఇన్ స్పెక్టర్లు శ్రీకాంత్, ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# సరదా సరదాగా..

- పర్యాటక ప్రాంతంగా సిద్దిపేటలోని కోమటిచెరువు
- సెలవుల్లో విద్యార్థులు వెళ్లడానికి చూడ ముచ్చటైన ప్రాంతం
- తీగల వంతెన, పార్కులు, నెక్లెస్ రోడ్డు ఎంతో ప్రత్యేకత
- కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం ప్రసిద్ధి


ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మికతకు అడ్రస్ సిద్దిపేట. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. ప్రసిద్ధి చెందిన ఆలయాలు.. అందమైన కోమటి చెరువు కనువిందు చేస్తున్నాయి. శని, ఆది వారాల్లో కోమటి చెరువుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తుంటారు. వేసవి సెలవుల్లో పర్యటించేందుకు ఇదో చూడచక్కని ప్రదేశంగా చెప్పవచ్చు.

–సాక్షి, సిద్దిపేట

**కొమురవెల్లి దేవాలయం**

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం. సిద్దిపేట పాత బస్టాండ్ నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ మల్లన్న పట్నం, బోనాలు చేయడం ప్రసిద్ధి. అనంతరం స్వామికి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. అలాగే సిద్దిపేట పట్టణంలో కోటి లింగాల దేవాలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయం సైతం సందర్శించొచ్చు.

**బోటింగ్..**



చెరువులో బోటింగ్‌ను సైతం అందుబాటులో ఉంచారు. స్పీడ్ బోట్, సాధారణ బోట్‌లు ఉన్నాయి. స్పీడ్ బోట్‌లో నలుగురు ప్రయాణించే విధంగా, సాధారణ బోట్ 20 నుంచి 30 మంది వరకు ప్రయాణించవచ్చు. స్పీడ్ బోట్ అయితే నలుగురికి కలిపి రూ.350, అదే సాధారణ బోట్ అయితే ఒక్కరికి రూ.50 వసూలు చేస్తున్నారు.

**వాటర్ షో..**

చెరువులో వాటర్ షోను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు రాత్రి 7, 8 గంటలకు ఇలా రెండు వాటర్ షోలు జరుగనున్నాయి. పాటలతో జలదృశ్యం ఆవిష్కృతం అవుతుంది. కలర్ కలర్ లైట్‌లతో వాటర్ డ్యాన్స్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ షోను కూర్చుని వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు.

**జిగేల్... జిగేల్ నెక్లెస్ రోడ్**

కోమటి చెరువు పై ఏర్పాటు చేసిన రూబీ నెక్లెస్ రోడ్డు పట్టణానికి మణిహారంగా నిలుస్తోంది. పచ్చదనం.. జిగేల్.. జిగేల్‌మనే విద్యుత్ కాంతులు ఎంతగానే ఆకర్షిస్తున్నాయి. వాకింగ్, సైక్లింగ్‌కు అనువుగా ఉండేందుకు సింథటిక్ ట్రాక్‌ను నిర్మించారు. రాత్రి సమయంలో ఒక వైపు విద్యుత్ కాంతులు.. మరో వైపు మానసిక ప్రశాంతత కోసం మ్యూజిక్‌ను ఏర్పాటు చేశారు. రూబీ నెక్లెస్ రోడ్ షూటింగ్ స్పాట్‌గా నిలుస్తోంది. ప్రీ వెడ్డింగ్, ప్రైవేట్ సాంగ్స్ చిత్రీకరించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్నారు.

**గ్లో గార్డెన్**

కోమటి చెరువు సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గ్లో గార్డెన్ మిరుమిట్లు గొలిపే అందాలతో ఆకర్షిస్తోంది. దేశంలోనే మొట్ట మొదట గుజరాత్‌లోని సర్దార్ వల్లాభాయ్ పటేల్ విగ్రహం వద్ద ఈ గ్లో గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం సిద్దిపేటలోనే ఏర్పాటు చేయడం విశేషం. మెరిసే జంతువు, పక్షులు, చెట్ల బొమ్మలు ప్రజలను ఎంతో ఆకర్షిస్తున్నాయి. ఫాగ్ పాయింట్ లోకి వెళ్తే మంచు కురిసే ప్రాంతానికి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. డ్యాన్సింగ్ ఫ్లోర్‌లో చిన్నారులు డ్యాన్స్‌లు వేస్తుంటారు.

**డైనో పార్క్..**

కోమటి చెరువుకు పక్కనే 1.5 ఎకరాల విస్తీర్ణంలో డైనో పార్క్‌ను ఏర్పాటు చేశారు. డైనో పార్క్ అంటే ఏదో ఎగ్జిబిషన్‌లా బొమ్మలు, 3డీ యానిమేషన్ స్క్రీన్‌లు కాదు. అమెరికా, సింగపూర్‌లలోని యూనివర్సల్ వరల్డ్ స్టూడియోలో ఉన్న డైనో పార్క్ తరహాలో సిద్దిపేటలో ఏర్పాటు చేశారు. ఈ పార్క్‌ను కొండలు, గుహాల మాదిరిగా నిర్మించారు. గుహాలో ఓపెన్ ట్రైన్‌ను ఏర్పాటు చేశారు. ట్రైన్‌లో వెళ్తుంటే డైనోసార్‌ల అరుపులు, మీదకు వచ్చిన అనుభూతి కలుగుతుంది. ఒక్కసారిగా డైనోసార్‌లు మీదపడినట్లు, భీకరంగా అరవడం లాంటివి సౌండ్‌లు ఏర్పాటు చేశారు. దీనికి ఒక్కరికి రూ.50లు టికెట్ వసూలు చేస్తున్నారు.





**కోమటి చెరువు**

సిద్దిపేట పట్టణంలో కోమటి చెరువు కోటి అందాలతో పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో కోమటి చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. సిద్దిపేట పాత బస్టాండ్ నుంచి 2 కిలోమీటర్ల దూరంలో పర్యాటక ప్రాంతమైన కోమటి చెరువు ఉంది. చెరువు వద్ద మున్సిపాలిటీ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చేశారు. ఈ చెరువుపై నిర్మించిన తీగల వంతెన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సుమారుగా 200 మీటర్ల దూరం ఉంటుంది. చెరువు మధ్యలో ఉన్నట్టుగా ఉంటుంది. దీనిపై ఒకేసారి 200 మంది నడిచే విధంగా తీర్చిదిద్దారు. వంతెనకు కలర్ లైట్‌లు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో విద్యుత్ కాంతులతో ఆకర్శిస్తోంది. దీని రుసుము రూ.10 వసూలు చేస్తున్నారు.

**స్కై సైక్లింగ్..**

మీరు సాహస యాత్రలు చేయాలనుకుంటే అద్భుతమైన యాక్టివిటీ కోమటి చెరువులో ఉంది. ఇక్కడ స్కై సైక్లింగ్‌ను ఏర్పాటు చేశారు. గాలిలో రోప్ సాయంతో సైకిల్ చేసే విన్యాసం చూపరులను గగుర్పాటుకు గురి చేస్తుంది. ఇది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఒక్కరికి రూ.50 రుసుం వసూలు చేస్తున్నారు.

### శుభకార్యానికి వస్తూ..

- టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పి..
- అక్కడికక్కడే వృద్ధుడు మృతి



పోచయ్య(ఫైల్)

**వర్గల్(గజ్వేల్):** బంధువుల ఇంట్లో శుభకార్యానికి వస్తూ టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పి కింద పడిపోయి వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం వర్గల్ మండలం మాదారం–గిర్మాపూర్ గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. మెదక్ జిల్లా దొంతి గ్రామానికి చెందిన దేవోల్ల పోచయ్య(70) టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ వాహనంపై వర్గల్ మండలం గిర్మాపూర్‌లో బంధువుల ఇంట్లో వివాహ వేడుకకు వస్తున్నాడు. మాదారం–గిర్మాపూర్ మధ్య మలుపులో వాహనం అదుపుతప్పి పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**మద్యానికి బానిసై ఉద్యోగి ..**

**బెజ్జంకి(సిద్దిపేట) :** మద్యానికి బానిసై ఉద్యోగి మృతి చెందిన ఘటన బెజ్జంకిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం కేంద్రానికి చెందిన న్యాత మల్లేశం(50) అక్కడే ఎంఆర్‌ఓ కార్యాలయంలో రికార్డు అసిసెంట్‌గా పని చేస్తున్నాడు. కుటుంబంతో కలిసి బెజ్జంకిలో నివసిస్తున్నాడు. మల్లేశం కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం తాగి బైక్‌పై ఇంటికొచ్చాడు. లోపలికి వస్తూనే మత్తులో కిందపడి అస్వస్థతకు గురయ్యాడు. కొద్దిసేపటికి వాంతులు, విరోచనాలు చేసుకున్నాడు. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.

# పశుగ్రాసం వృథాకు చెక్

**హార్వెస్టర్‌తో వరి కోతలు**

- అనంతరం గడ్డిని కట్టలు కట్టే బేలర్ యంత్రం
- కట్టకు రూ.30 నుంచి 35 వసూలు

**దుబ్బాకటౌన్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా రైతు సైతం యంత్రాలపై ఎక్కువగా ఆధార పడుతున్నాడు. హార్వెస్టర్‌తో కోసిన వరి పొలాల్లో గడ్డి తక్కువగా రావడంతో పాటు పొలంలో పడి వృథా అవుతుంది. దీంతో రైతులు ఆ గడ్డిని కాల్చేస్తున్నారు. డైరీ ఫామ్ నిర్వాహకులకు, పాల వ్యాపారంపై ఆధార పడుతున్న రైతులకు పశుగ్రాసం కొరత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పలువురు రైతులు బేలర్ యంత్రాలతో గడ్డిని కట్టలు కట్టి తెచ్చుకుంటున్నారు. గడ్డిని అమ్ముతూ పశుగ్రాసం కొరత తీర్చుకుంటున్నారు.

**ఒక్కో కట్టకు రూ.30 నుంచి 35**

వరి గడ్డి కట్టే బేలర్ యంత్రాలు ట్రాక్టర్‌కు అనుసంధానం చేయబడి ఉంటాయి. హార్వెస్టర్ కోసినప్పుడు పొలమంతా పడిన గడ్డిని బేలర్ యంత్రం కట్టలు కడుతుంది. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే 40 నుంచి 50 కట్టలు కడుతుంది. ఒక్కో కట్టకు రూ.30 నుంచి 35 తీసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో గేదెలను పెంచే రైతులు పొలంలోని గడ్డిని తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముందుగా రైతులకు ఎంతో కొంత డబ్బు చెల్లించి యంత్రంతో కట్టలు కట్టిస్తున్నారు.



గడ్డిని కట్టలు కడుతున్న బేలర్ యంత్రం

**కాల్చడానికి వెనుకడుగు**

గడ్డికి సైతం డబ్బులు వస్తుండటంతో రైతులు గడ్డిని కాల్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. వానా కాలం సీజన్ వరి పంట కోసేంత వరకు ఎండు గడ్డి దొరకని పరిస్థితి ఇక ఉండదు. కాబట్టి పశుగ్రాసాన్ని 3, 4 నెలలు వచ్చేలా పాడి రైతులు నిల్వ చేస్తుంటారు. ప్రస్తుతం వేసవి కావడంతో మేత లెక్కన ఒక్కో పాడి పశువు ఒక కట్ట మేస్తుంది. ఎకరానికి రూ. 2 నుంచి రూ.3 వేల వరకు గడ్డి కోసం ఖర్చు చేస్తున్నారు. దీంతో గడ్డికి డిమాండ్ ఏర్పడుతుంది.

**కట్టలు నిల్వ చేసుకుంటున్నా**



నాకు రెండు పాలిచ్చే గేదెలు ఉన్నాయి. మళ్లీ 3 నుంచి 4 నెలల వరకు గడ్డి దొరకదు. ప్రస్తుతం హార్వెస్టర్ కోసిన గడ్డిని కట్టలు కట్టించి నిల్వ చేసుకుంటున్నా. కట్టలు కట్టినందుకు 150 కట్టలకు సుమారు రూ.4,500 వరకు ఖర్చు వచ్చింది.

– భాస్కర్ రెడ్డి రైతు, దుబ్బాక

**కూలీల ఖర్చు తగ్గింది**



బేలర్ యంత్రాలు రాకముందు గడ్డి వాము పెట్టాలంటే రోజుకు ఒక్క కూలీకి రూ.600 నుంచి రూ.700 వరకు చెల్లించే వాళ్లం. బేలర్ యంత్రాలతో కట్టలు కట్టించడం వల్ల కూలీల ఖర్చు మిగలడమే కాకుండా సమయం వృథా కావడం లేదు.

– రాజిరెడ్డి రైతు, దుబ్బాక

# పోలీసులకే చుక్కలు చూపించాడు

- ఆరు నెలలుగా అనవసరంగా 77 సార్లు డయల్ 100కి కాల్
- విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

**కల్హేర్(నారాయణఖేడ్):** పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం పెద్ద ముబారక్‌పూర్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ డీ.వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. పెద్దముబారక్‌పూర్ గ్రామానికి చెందిన నాయకిని సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. రోజుకో పేరు, ఊరు పేరు మార్చుకుంటూ సాయంత్రం కాగానే డయల్ 100కు కాల్ చేయడం మొదలు పెట్టాడు. భార్య తప్పిపోయింది.. పెట్రోల్ పోసుకుంటున్నా.. మందు తాగి చనిపోతున్నా.. అంటూ రోజుకో మాట చెబుతూ డయల్ 100కు కాల్ చేశాడు. పోలీసులు వెళ్తే ఎవరూ ఉండేది కాదు. ఆరు నెలలుగా రోజూ పోలీసులకు చుక్కలు చూపించాడు. విసిగిపోయిన పోలీసులు డయల్ 100కు ఎవరూ కాల్ చేస్తున్నారనే కోణంలో విచారణ చేపట్టారు. సంబంధిత వ్యక్తి ఎవరని గుర్తించారు. ఎట్టకేలకు సురేశ్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎవరైనా డయల్ 100కు అనవసరంగా కాల్ చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

# కవిత్వానికి సమాజమే పునాది



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్, దేశపతి శ్రీనివాస్, నందిని సిదారెడ్డి, తదితరులు

**కవి వేణుగోపాల్**

**సిద్దిపేటకమాన్:** కవిత్వానికి సమాజమే పునాది అని కవి వేణుగోపాల్ అని అన్నారు. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి కిషన్ కవిత్వం పుస్తకాలు పేగు తెగిన పాట, వడిసెల ఆవిష్కరణ సభ నిర్వహించారు. మరసం అధ్యక్షుడు రంగాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కవి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కవిత్వానికి సామాజిక నేపథ్యమే పునాదిగా రచనలు చేస్తే ఆ రచన సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. వ్యక్తిగతమైన సాహిత్యం ఎక్కువ కాలం నిలబడేది కాదన్నారు. కవిత్వం మనిషిని మరింత ఉన్నతీకరించడానికి, సమాజంలో మానవ సంబంధాలను పెంపొందించడానికి ఉపయోగపడాలని అన్నారు. కార్యక్రమంలో యాదగిరి, అశోక్, నందిని సిదారెడ్డి, దేశపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# భారత సైనిక క్షేమం కోసం పూజలు





నారాయణఖేడ్: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కమిటీ బాధ్యులు, పూజారులు, భక్తులు. వీరభద్రుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న సభ్యులు

**జిన్నారం (పటాన్‌చెరు):** భారత సైనికుల సంక్షేమం, విజయాన్ని ఆకాంక్షిస్తూ దేవాదాయ శాఖ పిలుపు మేరకు ప్రసిద్ధ శైవక్షేత్రమైన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి , ఈఓ శశిధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉగ్రదాడులను భారత సైన్యం ఎదుర్కొనేలా ధైర్యసాహసాలు కల్పించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

**ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా..**

**ఝరాసంగం(జహీరాబాద్):** ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా కేతకీ సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆలయ అర్చకులు, అధికారులు గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కూంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్, ఈఓ శివరుద్రప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

**బోరంచ ఆలయంలో పూజలు**

**నారాయణఖేడ్:** భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న అప్రకటిత యుద్ధంలో మనదేశం విజయం సాధించాలని కోరుతూ మనూరు మండలం బోరంచ నల్లపోచమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యుద్ధంలో విజయం సాధించడంతోపాటు దేశ సైనికులకు ఎలాంటి ప్రాణనష్టం జరగవద్దని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లన్న, పూజారులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


# యువకుడి మృతదేహం లభ్యం

**వెల్దుర్తి(తూప్రాన్):** హకింపేట హల్దీ ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. వెల్దుర్తి మండలం చెర్లపల్లి పంచాయతీ పరిధి వర్దవాని చెరువు తండాకు చెందిన గోపాల్(34) చేపలు పట్టే క్రమంలో గురువారం నీటమునిగి గల్లంతయ్యాడు. శుక్రవారం ఉదయం ప్రాజెక్ట్‌లో మృతదేహం నీటిపై తేలడంతో బయటకి తీశారు. మృతుడికి భార్య చికిలి, కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి

**మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ**

**సదాశివపేట, (సంగారెడ్డి):** రోడ్డును అక్రమించి స్కూల్ బిల్డింగ్ నిర్మిస్తున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతాగోపాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని 16వ వార్డులో అక్రమంగా రోడ్డుపై లిఫ్ట్ నిర్మిస్తుండటంతో జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తాను మీమాదిరిగా కందకం అక్రమించి కాంప్లెక్స్ నిర్మించి రోడ్లుపై లిఫ్ట్ నిర్మించడం లేదని చింతా గోపాల్‌ను ఉద్దేశించి అన్నారు. గురునగర్ కాలనీలో నిర్మిస్తున్న స్కూల్ భవన నిర్మాణం పది ఫీట్ల రోడ్డును అక్రమించి నిర్మిస్తున్నది నిజం కాదాని నిలదీశారు. 590బై1బై2బై1లో అసైన్డ్ భూమిలో అక్రమంగా షెడ్డు నిర్మించి అద్దెకు ఇస్తున్నాడని తనపై చింతాగోపాల్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తాను మిలటరీ నుంచి వచ్చిన తరువాత ప్రభుత్వం తనకు ఈదులవాగు అసైన్‌మెంట్ భూమి కేటాయించిందని గుర్తు చేశారు.. తను బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్‌గౌడ్, సెజ్జీ, పిల్లోడి విశ్వనాథం, రవి, జైగౌడ్, రాములుగౌడ్, విష్ణువర్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

# విజ్ఞాన కేంద్రం.. కళల నిలయం

**విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరాలు**

- జహీరాబాద్ శ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ
- పెయింటింగ్, డ్రాయింగ్, మట్టితో బొమ్మల తయారీ వంటి వాటిల్లో తర్ఫీదు

**జహీరాబాద్ టౌన్:** వేసవి సెలవులు పిల్లలకు ఆనందాన్ని పంచే అద్భుత క్షణాలు. ఈ సెలవులను ఆడుతూ.. పాడుతూ సద్వినియోగం చేసుకునేలా జహీరాబాద్ శ్రామిక విజ్ఞాన కేంద్రం, మన లైబ్రరీ నిర్వాహకులు కృషి చేస్తున్నారు. కొన్నేళ్ల నుంచి వేసవి సెలవుల్లో ఉచితంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తూ పలు అంశాల్లో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వృద్ధి చేసుకునేందుకు కృషి చేస్తున్నారు. ఏప్రిల్ నెల చివరి వారంలో ప్రారంభమైన శిక్షణ శిబిరాలు మే మూడో వారం వరకు కొనసాగనున్నాయి.

**శిక్షణలో ముఖ్యమైనవి**

యూకేజీ నుంచి టెన్త్‌ల కోసం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇందులో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, గణిత నైపుణ్యం, పెయింటింగ్, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైయిటింగ్, మట్టితో బొమ్మల తయారీ, ఫిజిక్స్ పరిష్కారం, పేపర్‌తో కళాకృతులు తయారీ తదితర అంశాలపై నిపుణులు నేర్పిస్తున్నారు.

**పెరిగిన శిక్షణ కేంద్రాలు**

వేసవి శిక్షణ శిబిరం కొన్నేళ్ల కిందట పట్టణంలో మాత్రమే నిర్వహించే వారు. గ్రామీణ ప్రాంత పిల్లల పట్టణానికి రాలేకపోతున్నారని. ఈ సారి గ్రామల్లో కూడా శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో 3, ఎన్‌జీవోస్ కాలనీ, మాణిక్ ప్రభు వీధి, నాగన్‌పల్లి, అల్గోల్, కుప్పానగర్, బర్దిపూర్, రంజోల్, పిప్పడ్‌పల్లిలో ఒకటి చొప్పున పస్తాపూర్‌లో రెండు శిబిరాలు నడుస్తున్నాయి. వేసవి శిబిరాలకు మంచి స్పందన వస్తుంది. ప్రతీ సెంటర్ పదుల సంఖ్యలో పిల్లలు వస్తుండగా శిక్షకులు వారికి పలు విషయాలను ఆడుతూ పాడుతూ నేర్పిస్తున్నారు.



పిచరాగడి గ్రామంలోని శిబిరంలో పిల్లలు

**సద్వినియోగం చేసుకోవాలి**

వేసవిలో పిల్లలు సెల్‌ఫోన్‌కే పరిమితం కావడం, ఎండల్లో తిరగడం వంటివి చేస్తుంటారు. విద్యతో పాటు కళలు కూడా జీవితంలో ఎంతో ముఖ్యమైనవి, కాబట్టి కొన్నేళ్లుగా ఉచితంగా వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నాం. ప్రతీ సంవత్సరం నిర్వహించే శిబిరాలకు మంచి స్పందన వస్తుంది. ఈ సారి శిక్షణ కేంద్రాలను కూడా పెంచాం. తల్లిదండ్రులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్, శివబాబు,
శ్రామిక విజ్ఞాన వేదిక కార్యదర్శి, జహీరాబాద్